# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **తెలంగాణలో రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ ఈ ఉగాది నుంచి ప్రారంభిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.**

3. **కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం చేస్తుందని... డీలిమిటేషన్ విధివిధానాలపై ఇంకా చర్చే జరగలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.**

4. **అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు... పార్లమెంట్ ప్రాంగణంలో రెండు కాఫీ స్టాళ్ల ఏర్పాటుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు.**

5. **ఈరోజు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని.. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అకాల వర్షాలు, వడగళ్ల వర్షాలతో పలు జిల్లాల్లో జరిగిన పంట నష్టంపై చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. వడగళ్ల వాన కారణంగా కడప, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని 10 మండలాల్లో 40 గ్రామాల్లో పంటనష్టం జరిగిందని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

--------------------------

తెలంగాణలో రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ ఈ ఉగాది నుంచి ప్రారంభిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజుర్ నగర్‌లో శ్రీకారం చుడతారని తెలిపారు. ఏప్రిల్ నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులు ఒక్కొక్కరికి ... ఆరు కేజీలు సన్న బియ్యం అందిస్తామన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన దొడ్డు బియ్యం పక్కదారి పట్టడం వల్లే.. సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు... మంత్రి స్పష్టం చేస్తూ.....

..వాయిస్: 30 సెకన్లు....

--------------------------

కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం చేస్తుందని... డీలిమిటేషన్ విధివిధానాలపై ఇంకా చర్చే జరగలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని అసత్య ప్రచారం చేస్తున్నారంటూ కిషన్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్న ఆయన... దక్షిణాది రాష్ట్రాలకు ఏదో జరిగిపోతోందని ప్రచారం చేయడం సరికాదంటూ హితవు పలికారు.

--------------------------

అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు... పార్లమెంట్ ప్రాంగణంలో రెండు కాఫీ స్టాళ్ల ఏర్పాటుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. ఆ మేరకు సంగం 1, 2 కోర్టు యార్డ్ వద్ద స్టాళ్లు ఏర్పాటు చేసుకునేందుకు లోక్ సభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. ఈరోజు నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు.

--------------------------

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం. రోబర్ట్ కాక్స్ అనే శాస్త్రవేత్త 1882 వ సంవత్సరం మార్చి 24వ తేదీన క్షయ వ్యాధి క్రిమి కారకమైన మైక్రో బాక్టీరియా ట్యూబర్ క్యులోసిస్‌ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఇదేరోజు క్షయవ్యాధి నివారణా దినాన్ని జరుపు కుంటున్నారు. క్షయ అంటువ్యాధి అని, తొలి దశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స, మందులు తీసుకుంటే నివారణ సాధ్యమని, ప్రజలలో అవగాహన కల్పించేందుకు, క్షయ వ్యాధి రహిత సమాజ సాకారం లక్ష్యాలుగా ప్రపంచ ఆరోగ్యసంస్థ 1995వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలనా దినాన్ని నిర్వహిస్తోంది.

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ముఖాముఖి కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

విశాఖపట్నంలోని ఏసీఏ -విడిసిఏ స్టేడియంలో భవిష్యత్ లో మరిన్ని ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగేలా కృషి చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ తెలిపారు. భారత్ జట్టుకు కలిసి వచ్చే విశాఖ స్టేడియాన్ని మరిన్ని హంగులతో తీర్చిదిద్ది అంతర్జాతీయ మ్యాచ్ లు జరిగేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్ జట్టుకు హోం గ్రౌండ్ గా ఉన్న విశాఖ స్టేడియం..... మహిళ వరల్డ్ కప్ మ్యాచ్ లకు కూడా ఆతిథ్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా రూపు దిద్దే పనిలో ఉన్నట్లు కేశినేని శివనాథ్ తెలియజేస్తూ...

..వాయిస్: 36 సెకన్లు....

--------------------------

భద్రాచలంలో ఏప్రిల్ 6న జరగనున్న సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరౌతారని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి అభివృద్ధి పనుల్లో భాగంగా మాడ వీధులకు

సంబంధించిన పనులను ముఖ్యమంత్రి శ్రీరామనవమి రోజు ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి పొంగిలేటి తెలిపారు. కల్యాణానికి వచ్చే భక్తులంతా శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని.. సురక్షితంగా ఇంటికి చేరేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 22 సెకన్లు....

---------------------------

ఐపీఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ఆరంభించింది. హైదరాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్ ఇషాన్ కిషన్ 45 బంతుల్లోనే సెంచరీ చేశాడు. ఐపీఎల్‌లో ఇషాన్ కిషన్‌కు ఇది తొలి సెంచరీ. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 242/6 పరుగులకు పరిమితమైంది. కాగా చెపాక్ స్టేడియంలో ముంబయి ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 156 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

---------------------------

ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ బెట్టింగులు, బుకీల కదలికలపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వ్యక్తుల సమగ్ర సమాచారం పోలీస్ శాఖ వద్ద ఉందని అన్నారు. వినోదం కోసమే క్రికెట్ చూడాలని, బెట్టింగులవైపు ప్రజలు మొగ్గుచూపకూడదని పిలుపునిచ్చారు. ఆన్ లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల యువత, విద్యార్థులు ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారని... వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. క్రికెట్ బెట్టింగులు పాల్పడినా, సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

---------------------------

రాజధాని అమరావతి ప్రాంతంలో స్థానికుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు తుళ్లూరులోని హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ వేదికలో ఈరోజు వారితో సమావేశం నిర్వహించనున్నట్లు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్‌డీఏ తెలిపింది. గ్రామస్థుల సహకారం, భాగస్వామ్యం గురించి సమావేశంలో చర్చించనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ రోజు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అమరావతి ప్రాంత ప్రదలందరూ సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తెలియజేయవచ్చని పేర్కొంది.

=====================